క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



వేమూరు: గ్రామాల్లో పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, థీమ్–5 , క్లీన్ అండ్ గ్రీన్ విలేజీపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా గ్యార్మీ పండుగ




భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో మంగళవారం రాత్రి గ్యార్మీ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు. పురవీధులలో జెండా ఊరేగింపు చేపట్టారు. ఆస్థాన–ఏ ఖాద్రియా పీఠాధిపతి కరామత్‌షా హజరత్ మహబూబ్ సుభాని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమం అత్యంత వైభవంగా సన్నాహాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాసేవలో రోటరీ క్లబ్ ముందంజ



తెనాలి: ప్రజల అవసరాలను గుర్తించి, అందుకనుగుణమైన సేవలను అందించటంలో తెనాలి రోటరీ క్లబ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని రోటరీ డిస్ట్రిక్ట్–3150 గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అయితానగర్‌లోని అపర కర్మశాలకు కావాల్సిన 60 కుర్చీలు, అయిదు డైనింగ్ టేబుల్స్‌ను సమకూర్చారు. అపర కర్మశాల కమిటీకి డిస్ట్రిక్ట్ గవర్నర్ రామ్‌ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు సంస్థ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా అయితానగర్‌లోని హిందూ స్మశానవాటికి వద్ద 37 మొక్కలను నాటారు. ఈ ఏడాదిలోపు కోటి మొక్కలను నాటి సంరక్షించాలనే సంకల్పంతో రోటరీ పనిచేస్తోందని డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ చెప్పారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, డిస్ట్రిక్ట్ కేబినెట్ సభ్యుడు కన్నెగంటి మురళీకృష్ణ, అపర కర్మశాల కమిటీ సభ్యులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

గోశాల తరలించాలని ఆందోళన



అనంతవరం(తాడికొండ): తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలో అనుమతులు లేకుండా గోశాల నిర్వహిస్తున్నందున దానిని తరలించాలని బీజేపీ, వీహెచ్‌పీ నాయకులతో పాటు గ్రామస్తులు పలువురు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న ఈ గోశాలలో గోవులకు సరైన పోషణ అందించడం లేదని వారు ఆరోపించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పశు సంవర్ధక శాఖ అధికారిణి రేణుకాదేవి గతంలో నోటీసులు జారీ చేసినా తరలింపునకు చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మరోమారు నిరసన తెలిపామని పేర్కొన్నారు.

ఇనుము దొంగల అరెస్టు

మంగళగిరి టౌన్: నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద ఐరన్ సామగ్రి చోరీకి పాల్పడుతున్న నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సి.హెచ్.వెంకట్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న కురగల్లు గ్రామంలో బీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి సుమారు రూ. 2 లక్షల విలువ చేసే సామగ్రి చోరీ జరిగిందన్నారు. విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన చల్లా జగదీష్, గణేష్, దుర్గారావు, మరో ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

వంచించడం బాబుకు అలవాటే..!

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రెండు గ్రామాల్లో సంతకాల సేకరణ



కోటి సంతకాల కార్యక్రమం గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె: ప్రజలను వంచిండం టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్యఅని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. రచ్చబండ, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని చాట్రగడ్డ, పెనుమూడి గ్రామాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మడమ తిప్పక ప్రజలకు సంక్షేమ పాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఐదు సంవత్సరాల పాటు సంక్షేమ పాలనను అందించారని, ప్రతి రోజు పండుగ వాతావరణం ఉండేదని గుర్తు చేశారు. ప్రజలను ముంచేలా పాలన చేయటం చంద్రబాబుకు అలవాటేనన్నారు. పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని అధోగతిపాలు చేస్తున్నారని ఆరోపించారు. వైద్య విద్యను విద్యార్థులకు అందించేందుకు నాడు జగనన్న రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే నేడు వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసేందుకు ప్రైవేటీకరణకు చంద్రబాబు పూనుకోవటం హేయమన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం కొత్తగా చేసిందేమీలేదన్నారు. సంక్రాంతికే గ్రామాలకు వెళ్లే రోడ్లన్ని నిర్మిస్తామని చెప్పారని, మళ్లీ మరో సంక్రాంతి వస్తున్నా నేటికీ సమస్యను పట్టించుకోకపోవటం దారుణమన్నారు. కూటమిపాలనపై ప్రజల అసహనంతో ఉన్నారని పేర్కొన్నారు. మళ్లీ జగనన్న సంక్షేమ పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈసందర్భంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణను చేపట్టారు. వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్‌లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, నాయకులు బొర్రా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసే కుట్ర



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

- పేదలకు ఉచిత వైద్యాన్నీ దూరం చేస్తున్న సీఎం చంద్రబాబు
- వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- సూరేపల్లిలో కోటి సంతకాల సేకరణ

భట్టిప్రోలు: పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను, పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే కుట్రకు సీఎం చంద్రబాబు నాయకుడు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆరోపించారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీలోని గ్రామంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అశోక్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి నవంబర్ 26వ తేదీ వరకు కోటి సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేదలకు జరిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోను కనీసం 500 మందితో సంతకాలు సేకరించడం చేపట్టినట్లు చేపట్టారు. ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేల సంతకాల సేకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కోటి సంతకాల కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పి.శ్రీనివాసరావు, పరిశీలకులు అన్నపరెడ్డి వీరారెడ్డి పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు



రేపల్లె: బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే ప్రభుత్వం నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నిర్దేశిత కార్యాలయాల నుంచి దుకాణాల యజమానులు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. మున్సిపాలిటీ, విద్యుత్, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ తదితర కార్యాలయాల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు పొందకుండా విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవటంతో పాటు మందుగుండు సామగ్రిని సీజ్ చేస్తామన్నారు. మందుగుండు సామగ్రి తయారు చేసినా, ముడిసామగ్రి కలిగి ఉన్నా నేరమేనన్నారు. తమ పరిసరాలలో ఎవరైనా ఈ చర్యలకు ఉపక్రమిస్తే సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, నగదు పురస్కారం సైతం అందిస్తామన్నారు. పట్టణ ప్రజలు ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని కోరారు.

కోటి సంతకాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

వేమూరు: పేద బడుగు బలహీన వర్గాలకు మెడికల్ సీట్లు రాకుండా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తోందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. చెరుకుపల్లి గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేమూరు, అమర్తలూరు, చుండూరు మండలాల గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ పరిశీలకులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గత ప్రభుత్వ హయంలో నిర్మించిన ప్రభుత్వం వైద్యశాలలు, వివిధ దశల్లో ఉన్న వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రతి గ్రామంలో రచ్చబండ నిర్వహించి కోటి సంతకాలు చేయించాలని ఆయన సూచించారు. ప్రతి నెల నాల్గో వారంలో గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రతి రచ్చబండ కార్యక్రమంలో చర్చించిన అంశాలపై తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పార్టీ కన్వీనర్, గ్రామ పరిశీలకులు రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు, రేపల్లె నియోజక వర్గం పరిశీలకులు నారాయణ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు దాది సుబ్బారావు, అనపురెడ్డి రాఘురామిరెడ్డి, మదన్, కోగంటి లవకుమార్, చిలుమూరు రామోహనరావు, గాదె శివరామకృష్ణా రెడ్డి, దాట్ల మోహన్ రెడ్డి, గోపాలం రాము, పటమటి శ్రీనివాసరావు, దున్నా మేరీసుబాబు, గాజుల చినభాను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్ చేసే విధానంపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మాధురి

రేపల్లె: విద్యార్థి దశ నుంచే వ్యాధులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని డాక్టర్ టి.మాధురి చెప్పారు. గుండె నొప్పి వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించి మాట్లాడారు. వివిధ రకాల వ్యాధుల వచ్చిన సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్సలు సైతం తెలిసి ఉండాలని సూచించారు. ప్రస్తుతం గుండెకు సబంధించిన సమస్యలు జఠిలంగా ఉన్నాయని, వీటిపై అవగాహన కలిగి తోటివారికి, తమ పెద్దలను సైతం చైతన్య పరచాలని సూచించారు. ఛాతి నొప్పిగాని, ఒత్తిడి, చేతులు జాలువారినట్లు ఉన్నా, శ్వాస సరిగా అందకపోయినా గుండె సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. ఇటువంటి లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే సకాలంలో వైద్యుడిని సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు. నొప్పితో స్పృహ కోల్పోతే వెంటనే సీపీఆర్ చేయాలని తెలియజేసి, సీపీఆర్ చేసే విధానంపై ప్రయోగపూర్వకంగా వివరించారు. ప్రిన్సిపాల్ ఈవీఆర్ గిరికుమారి, సూపర్‌వైజర్ దామెర్ల శ్రీలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం దారుణం

ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణయ్య



బాపట్లలో నిలిచిపోయిన మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న రమణయ్య తదితరులు

బాపట్ల: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తే వైద్యం వ్యాపారంగా మారిపోయి సామాన్యులకు అందనంత దూరంలో ఉంటుందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణయ్య అన్నారు. బుధవారం నిర్మాణ దశలో నిలిచిపోయిన బాపట్ల మెడికల్ కళాశాలను సందర్శించి ఇక్కడ జరిగిన పనులను ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్య అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నెలకొల్పిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతి ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దారుణమన్నారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు వైద్య కళాశాల అవసరం ఎంతో ఉందన్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ప్రభుత్వ ఈ చర్యతో వెనుకబడిన తరగతులు, దళితులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ పద్ధతి వారికి అందకుండా పోతుందన్నారు. ఫీజులు విపరీతంగా పెరుగుతాయని, సామాన్య విద్యార్థులకు వైద్య విద్యకు అవకాశాలు తగ్గిపోతాయన్నారు. వైద్య కళాశాలను పరిశీలించిన వారిలో ప్రజారోగ్య వేదిక జిల్లా కన్వీనర్ కె.రఘుచంద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్.జుందార్, సీఐటీయూ నాయకులు కె.శరత్, ప్రజా సంఘాల నాయకులు వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు వేగంగా పూర్తి చేయాలి

తాడికొండ: ఈ- పంట నమోదు వేగవంతంగా పూర్తిచేయాలని మంగళగిరి వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తాడికొండ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు పండించిన పంటలను ఈ -పంట నమోదులో నూరుశాతం పూర్తిచేయాలన్నారు. పంట కోత అనంతర ప్రయోగాలు, దిగుబడి అంచనాలు రూపొందించాలని సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో అందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏవో బి శ్రీనివాస నాయక్, ఏఈవో కృష్ణారావు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

భారతరత్న అబ్దుల్‌కలాం స్ఫూర్తిప్రదాత

నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ గణేష్



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్



బాపట్లలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, నాయకులు

రేపల్లె: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యువతక స్ఫూర్తిప్రదాత అని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని మండలంలోని చాట్రగడ్డలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుకునేందుకు పేదరికం అడ్డు కాదని నిరూపించి, శాస్త్రవేత్తగా, భారత ప్రథమ పౌరుడిగా తనదైన రీతిలో రాణించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్‌లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, నాయకులు చిమటా బాలాజీ కె.వి.కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు డాక్టర్ అబ్దుల్ కలాం ..

బాపట్ల: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భావితరాలకు ఆదర్శనీయులని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద జరిగాయి. తొలుత నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్రకార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ భావితరాలు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ప్రయోగాలవైపు పయనించాలని సూచించారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, చీరాల వెంకటేశ్వరరెడ్డి, జోగి రాజా, అడే చందు, మచ్చా శ్రీనివాసరెడ్డి, వాలి శ్రీనివాసరెడ్డి, నర్రావుల వెంకట్రావు తదితరులు ఉన్నారు.

మహనీయుడు కలాం..

రేపల్లె: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మసీద్ సెంటరులోని అబ్దుల్ కలాం విగ్రహానికి బుధవారం వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సముద్రాల ప్రభుకిరణ్, నాయకులు డాక్టర్ అతిక్, లియాఖత్‌బాషా, షేక్ అబ్దుల్ ఖుద్దూస్, సజ్జా పద్మావతి పాల్గొన్నారు. అదేవిధంగా అహ్మదీయ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అబ్దుల్ కలం విగ్రహానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భట్టిప్రోలు: భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని బుధవారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. హెచ్ఎం రామకోటేశ్వరరావు మాట్లాడారు.

అసభ్య ప్రవర్తన కేసులో జరిమానా

తెనాలిరూరల్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సోమసుందరపాలెంకు చెందిన మహిళతో ఆమె బావ వెంకటసుబ్బారావు 2021లో అసభ్యంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ హెడ్‌కానిస్టేబుల్ మేకల రమేష్ కేసు నమోదు చేయగా, ఎస్ఐ ప్రసన్నకుమార్ చార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసు బుధవారం విచారణకు రాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రధాన సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) ఆకా పవన్‌కుమార్ నిందితుడికి రూ.రెండు వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

నిబంధనలు పాటించాలి

తెనాలి: దీపావళి పండుగకు తెనాలి డివిజన్‌లో లైసెన్స్ కలిగిన హోల్‌సేల్ వ్యాపారులు, తాత్కాలిక లైసెన్సులు తీసుకునేవారు తగిన నియమ నిబంధనలు తప్పక పాటించాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి స్పష్టంచేశారు. దీపావళి బాణసంచా విక్రయాలకు సంబంధించి బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెనాలి డివిజన్ స్థాయి రెవెన్యూ, పోలీస్, ఫైర్, జీఎస్టీ ఇతర శాఖల అధికారులతో జరిగిన సమావేశానికి లక్ష్మీకుమారి అధ్యక్షత వహించారు. తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునేవారు తగిన సూచనలు పాటించాలనీ, లైసెన్సు వచ్చాక తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దీనిపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజనులో మండల తహసీల్దార్లు, పోలీసు అధికారులు ఫైర్ స్టేషన్ అధికారులు, జీఎస్టీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రత ముఖ్యం



భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మానవహారంలో పాల్గొన్న మహిళలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలలో చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల వ్యాధులను ఎలా నివారించవచ్చో తెలియ చేయడానికి ఈ దినోత్సవం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో మానవహారం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం మండల సమాఖ్య కోశాధికారి కట్టా జ్యోతి ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. ఎంపీడీఓ సాతులూరి వెంకట రమణ ముఖ్య అతిథిగా విచ్చేసి హ్యాండ్ వాష్‌డే ఆవశ్యకతను తెలియ చేశారు. మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ చేతుల శుభ్రత ప్రాధాన్యతను సెవెన్ స్టెప్స్ డెమో పద్ధతిలో అందరికీ తెలియ చేశారు. మానవహారంలో స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీసీలు దాసరి హనోకు, పానుగోటి నరేంద్ర, కొలకలూరి రజని కుమారి, అకౌంటెంట్ బత్తుల శిరీష, వీఓఏలు, వీఓ అధ్యక్షులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): విద్యార్థులు ఆహార పదార్థాలు తినేముందు, మల, మూత్ర విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని వేటపాలెం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డిప్యూటీ హెచ్ఈఓ పోలే కోటేశ్వరరావు తెలిపారు. చుండూరు మండలం చినపరిమి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం బుధవారం నిర్వహించారు. వాసిమళ్ల పుష్పరత్నం, దాసరి మేరీకమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి గట్లపై కూరగాయల మొక్కలతో లాభాలు

నాలుగు గ్రామాల్లో ప్రకృతి పంటలను పరిశీలించిన అధికారులు



చివలూరులో వరిగట్లపై సాగు చేస్తున్న పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

కొల్లిపర: రైతులు వరిపైరుతో పాటుగా పొలం గట్లపై కూరగాయల మొక్కలు పెంచుకుంటే రైతులకు అధిక ఆదాయం మరియు ఆరోగ్యం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సీనియర్ టెక్నికల్ లీడ్ గోపీచంద్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారిలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దావులూరు, కొల్లిపర, చివలూరు మరియు అత్తోట గ్రామాలలో పర్యటించి జీవవైవిధ్య పంటల వలన ప్రధాన పంటకు చీడపీడల నివారణ జరుగుతుందని తెలియజేశారు. రైతులతో అనేక విషయాలపై చర్చించారు. చివలూరు గ్రామంలో వరి గట్లపై అన్నీ రకాల కూరగాయలు, బంతి పూలుసాగు చేస్తున్న రైతు దూసరి రాజారావును అభినందించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



తెనాలిఅర్బన్: అనాథ మృతదేహానికి శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు బుధవారం సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలోకి వెళితే.. రేవేంద్రపాడు - వడ్లమూడి గ్రామాల మధ్యన గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అతని ఆచూకీ కోసం విచారణ జరిపారు. వివరాలు లభించకపోవడం, అనాథగా తేలడంతో పోలీసులు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనును సంప్రదించి అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. సభ్యులు బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. సమితి సభ్యులు మల్లెల వాసు, ఆవులమంద ప్రసాద్, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.